క్లుప్తంగా

నేడు ఎర్రా ప్రగడ గ్రంథావిష్కరణ

ఒంగోలు మెట్రో: ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద గల బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు పద్య సారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, సంస్థ ప్రధాన కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు తెలిపారు. పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు, బహు గ్రంథకర్త, ప్రముఖ మహా కవి, ఎర్రన వంశీయులు చదలవాడ లక్ష్మీనరసింహారావు పరిశోధనాత్మక దృష్టితో జీవిత కాలపు తపస్సుగా భావించి శ్రమించి రచించిన గ్రంథావిష్కరణ సభకు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షత వహిస్తారన్నారు. పలువురు ప్రముఖులు పాల్గొంటారని, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పద్య సారస్వత పరిషత్ నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు పరాంకుశ చక్రవర్తి ఉదయం తొమ్మిది గంటలకు పదిహేను మంది దంపతులతో సామూహికంగా రమా వసుంధర సమేత శ్రీస్వామి వ్రతాలు జరిపించారు. ముందుగా విష్వక్సేన పూజ, మండపారాధన, అభిషేకం, స్వామి అష్టోత్తరం చేయించి రమావసుందర సమేత సత్యనారాయణ వ్రత కథలను భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి అర్చకులతో ఆశీర్వచనం అందుకున్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి ఈకేవైసీని ఆదివారంలోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) ఎస్.శ్రీనివాసరావు కోరారు. ఒంగోలు ఏడీఏ కార్యాలయంలో శనివారం వీఏఏల సమావేశం నిర్వహించగా, ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ సంవత్సరం 4,225 టన్నుల ఎరువులు విక్రయించామని చెప్పారు. విక్రయించిన వివరాలను డీబీటీ యాప్‌లో సత్వరమే నమోదు చేయాలని కోరారు. ఒంగోలు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎక్కువ ఎరువులు విక్రయించినందుకు వీఏఏలకు అభినందనలు తెలిపారు. ఏడీఏ రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు వివరాలను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించి ఏవైనా తప్పులుంటే సరిదిద్దాలని కోరారు. ఒంగోలు, టంగుటూరు, చీమకుర్తి, సంతనూతలపాడు, కొత్తపట్నం, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల వ్యవసాయాధికారులు, వీఏఏలు, టెక్నికల్ వ్యవసాయాధికారి రాధారాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



దివ్యాంగుడు ప్రసన్నకుమార్ తల్లిదండ్రులను వివరాలడిగి తెలుసుకుంటున్న రమేష్

కొత్తపట్నం: భవిత కేంద్రాలకు హాజరు కాలేని దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే గృహ ఆధారిత విద్య ఉపయుక్తంగా ఉంటుందని సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా ఇన్‌చార్జి, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం.రమేష్ అన్నారు. మండలంలోని రాజుపాలెం, కొత్తపట్నం గ్రామాల్లో ఉన్న గృహ ఆధారిత విద్య తీరు తెన్నులను పరిశీలించారు. రాజుపాలెంలో ఉన్న దివ్యాంగుడు ఐనంపూడి ప్రసన్నకుమార్, కొత్తపట్నం చాకిరేవు మిట్ట కాలనీలో ఎం.కుమారిస్వామి గృహాలను శనివారం ఆమె సందర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడుతూ గృహ ఆధారిత విద్య ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. ప్రతి శనివారం మీ ఇళ్లకు వస్తున్నారా, వచ్చిన తర్వాత మీకు ఏం ఎక్సర్‌సైజులు చేయిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కొత్తపట్నంలో ఎంపీపీఎస్–30 స్కూల్, చాకిరేవు మిట్ట ప్రాథమిక పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. కేంద్రాలకు హాజరు కాలేని ప్రతి దివ్యాంగుల గృహాలకు వెళ్లి వారు చేయాల్సిన ఎక్సర్‌సైజులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పద్మావతి, సీఆర్పీ శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఇది కాదా..?



మల్లవరంలో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, సర్పంచ్, నాయకులు



ఆర్‌బీకే ఎదుట నాయకులతో మంత్రి మేరుగు నాగార్జున

- ప్రతిపక్షాలను ప్రశ్నించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున
- పలు గ్రామాల్లో ఆర్‌బీకేలు, సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం

మద్దిపాడు: గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని మాట్లాడుతున్న పచ్చ పార్టీ నేతలకు, వారి మాటలను నమ్మించడానికి విషప్రచారం చేస్తున్న పచ్చ పత్రికలకు కళ్లు కనిపించడం లేదా..? అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలు వెచ్చించి సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టించారని, వీటితో గ్రామాలు అభివృద్ధి చెందలేదా అని ప్రశ్నించారు. మండలంలోని వెల్లంపల్లి, కొలచనకోట, మల్లవరం, అన్నంగి, రాచవారిపాలెం గ్రామాల్లో ఆర్‌బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యం పాలైతే మండలంలో ఉండే పెద్దాస్పత్రికి పోవాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే వెల్‌నెస్ సెంటర్లు కట్టించి ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారని సీఎం జగన్‌ను కొనియాడారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండలాల్లో వేచి ఉండకుండా వారి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడానికి ఆర్‌బీకేలను ప్రతి సచివాలయంలో ఏర్పాటు చేశారని తెలిపారు. రైతులకు వెన్నుదన్నుగా నిలవడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. సచివాలయాలు ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలను గ్రామాల్లోనే అందించడం అభివృద్ధి కాదా అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి మండల కేంద్రాలకు తిరగాల్సిన పరిస్థితి నుంచి ప్రస్తుత ప్రభుత్వం అన్ని రకాల సేవలను ఇంటి ముంగిటికే తీసుకొచ్చింది నిజం కాదా అని ప్రతిపక్షాలకు మంత్రి మేరుగు ప్రశ్నల వర్షం కురిపించారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలను మన బడి, నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పునర్నిర్మాణం చేయించి ఇంగ్లిషు చదువులు చెప్పిస్తున్నారని వివరించారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా.. అసలు అభివృద్ధే చేయడం లేదని పచ్చపత్రికలు విషపు రాతలు రాయడంపై మంత్రి మండిపడ్డారు. ఎవరు ఎన్ని జతలు కట్టినా సింహంలా ఢీకొట్టడానికి ముఖ్యమంత్రి జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి సహించలేని చంద్రబాబు.. బాకా పత్రికలతో రోత రాతలు రాయిస్తున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణమ్మ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఓ కె.రమేష్, పీఆర్ ఏఈ సునీల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, నాయకులు ఓబులరెడ్డి, పోతినేని శ్రీనివాసరావు, గుడ్డపాతల రవి, తేళ్ల పుల్లారావు, నరసింహారావు, అన్వేష్, రావూరి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, పిచ్చిరాజు, వెల్లంపల్లి సుబ్బారెడ్డి, డొక్కా మరియమ్మ, జయమ్మ, మస్తానమ్మ, సింగయ్య, హరిబాబు, పల్లపాటి లోకేశ్వరి, రాయపాటి వెంకట సుజాత, దుడ్డు వినోద్, నాగమల్లీశ్వరి, పిట్టల ఆంజనేయులు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, పాల్గొన్న నాయకులు

పట్టాల పంపిణీతో నైరాశ్యంలో టీడీపీ

- ఏం చేయాలో తెలియక తప్పుడు ప్రచారం
- మరో వైపు తప్పుడు కేసులతో పేదల అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం
- మాట ఇస్తే నెరవేర్చడమే బాలినేనికి తెలుసు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్

ఒంగోలు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 21 వేల మందికి ఒంగోలులో ఇళ్ల పట్టాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పంపిణీ చేయించడంతో టీడీపీ నేతల్లో నైరాశ్యం నెలకొందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ విమర్శించారు. శనివారం రాత్రి స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల అభివృద్ధిని ఓర్చుకోలేని టీడీపీ.. అడుగడుగునా అడ్డుపడుతూ వచ్చిందన్నారు. అర్హులైన పేదలను ఎంపికచేసినా.. ప్రతిసారీ కోర్టును ఆశ్రయిస్తూ అడ్డుకోవడమే లక్ష్యంగా టీడీపీ నేతలు ముందుకుసాగారన్నారు. 25 వేల మందికి 800 ఎకరాల్లో పట్టాలు ఇచ్చేందుకు యరజర్లలో అన్నీ సిద్ధం చేస్తే.. మైనింగ్ భూమి అంటూ కోర్టును ఆశ్రయించారన్నారు. గతంలో అదే భూమిని మైనింగ్‌కు ఇవ్వడానికి వీల్లేదని, ఇతరత్రా అవసరాలకు వాడుకోవాలంటూ అదే వ్యక్తులు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. శుక్రవారం పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తి కావడంతో వారు కొత్త పంథాను ఎంచుకుని తప్పుడు ప్రచారం చేయడం మొదలుపెట్టారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి బాలినేని అని కొనియాడారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ.. మభ్యపెట్టే మాటలతో ప్రజలను మోసగించడం తప్ప ఏమీ పట్టించుకోలేదని శంకర్ మండిపడ్డారు. నేడు పట్టాలిస్తుంటే దానిపై కూడా తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ పేదలకు పట్టాల కోసం తన రాజకీయ జీవితాన్ని సైతం ఎమ్మెల్యే బాలినేని పణంగా పెట్టి పోరాడారని వివరించారు. ఈ విషయం ప్రజలందరికీ అర్థమవుతుందన్నారు. పూర్తిగా లే అవుట్ వేసి రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇంటి స్థలం అప్పగిస్తుంటే.. టీడీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో ఏం చేయాలో తెలియక అసత్య ప్రచారానికి తెరదీస్తున్నారని మండిపడ్డారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కావాటి రవికుమార్ మాట్లాడుతూ బాలినేని మాట ఇస్తే నెరవేరుస్తారనే దానికి పట్టాలు పంపిణీ చేసిన తీరే నిదర్శనమన్నారు. మాట ఇచ్చి తప్పేవారయితే ఒంగోలులో ఇంటి పట్టాల కోసం ఇంతగా పోరాడేవారు కాదన్నారు. పేదలకు పట్టాలు ఇవ్వాల్సిందేనంటూ పట్టుబట్టి పోరాడిన నేత బాలినేని అని కొనియాడారు. కేవలం ఇంటి పట్టాలే కాకుండా లే అవుట్లలో తాగునీటి పైప్‌లైనుకు సైతం రూ.250 కోట్లను వేదికపైనే సీఎం ప్రకటించారంటే.. బాలినేని కృషి ఏంటో తెలుసుకోవాలన్నారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పట్టాలు పంపిణీ చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ పట్టాలు పొందిన వారిలో చాలామంది టీడీపీ, జనసేన వారు కూడా ఉన్నారని, తమకు వేదిక వద్ద కనిపించారని అన్నారు. చివరకు సొంత పార్టీ కార్యకర్తల అభివృద్ధిని సైతం ఓర్చుకోలేని దుస్థితి టీడీపీలో నెలకొందని విమర్శించారు. పార్టీలకతీతంగా ఇంటింటి సర్వే ద్వారా అర్హుల ఎంపిక జరిగిందని, అయినా, దీనిని ఎలాగైనా అడ్డుకోవాలన్న టీడీపీ కుట్ర మహిళల అభీష్టం ముందు ఓడిపోయిందని అన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు రాయపాటి అంకయ్య, గంటా రామానాయుడు పాల్గొన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- డీఏఏబీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి



సమావేశంలో చర్చిస్తున్న జేసీ గోపాలకృష్ణ, డీఏఏబీ చైర్మన్ రవీంద్రరెడ్డి, సభ్యులు

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆదుకుంటోందని డీఏఏబీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి రవీంద్రరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పంట వేసిన నాటి నుంచి ధాన్యం సేకరణ వరకు రైతులకు అండగా ఉంటోందని వివరించారు. రైతుల ఆదాయం పెరిగి సంతోషంగా ఉన్న విషయాన్ని వివరించారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 51,989 మంది రైతులు సాగు చేసిన కంది పంటను ప్రభుత్వం సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని చెప్పారు. రెండు రోజుల్లోనే నగదు వారి ఖాతాల్లో జమవుతోందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు, విత్తనాలు, పురుగు మందులను ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన, తక్కువ ధరలకు అందించామని చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ మాట్లాడుతూ సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ గురించి వివరించారు. ఫిషరీస్ ఏడీ చంద్రశేఖర్, ఏపీఎంఐడీ పీడీ పీవీ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ గెలుపే లక్ష్యంగా అభిమాని బైక్ పర్యటన



బైక్ పర్యటన చేస్తున్న సన్యాసిరావు

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో 175/175 సీట్లు గెలుచుకోవాలనే ఆకాంక్షతో శ్రీకాకుళం జిల్లా అంపోలుకు చెందిన అభిమాని జి.సన్యాసిరావు బైక్ పర్యటన చేపట్టారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పర్యటనలో భాగంగా శనివారం ఒంగోలు చేరుకున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి సంక్షేమ పాలన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం జగన్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు ఓటర్లను జాగృతం చేయాలనే ఉద్దేశంతో తాను ఈ పర్యటన చేపట్టానన్నారు. ఇప్పటివరకు 38 నియోజకవర్గాల్లో పర్యటించినట్లు తెలిపారు. అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ప్రజల నుంచి వైఎస్సార్ సీపీకి లభిస్తున్న స్పందన చూసి ఆనందంగా ఉందన్నారు. ఎన్నికలకు రెండురోజుల ముందు వరకు తాను ఈ పర్యటన కొనసాగిస్తానన్నారు. విద్యార్థులు వాస్తవాలు తెలుసుకుంటూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని, అవాస్తవాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు సబర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా నుంచి బయటకు వెళ్తున్న పోలీస్ అధికారులను ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. ఎస్పీ చాంబర్‌కు పిలిపించుకుని వారిని అభినందించారు. ఇప్పటి వరకు చేసిన సేవలను కొనియాడారు. వారికి శాలువాలు కప్పి అభినందించారు. ఉద్యోగులకు బదిలీలు అనేవి సర్వసాధారణమని ఎస్పీ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కే నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలిసిన దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు...

సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ నుంచి ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా వచ్చిన సీహెచ్ శ్రీనివాసరావు శనివారం ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు

ఒంగోలు సెంట్రల్: ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) రైతులు కూరగాయల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుందని ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు, హెచ్‌ఆర్‌ఎస్ సీనియర్ సైంటిస్ట్ వెంకట రామన్నగూడెం సూచించారు. ఒంగోలులో రీజినల్ హార్టికల్చర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌హెచ్‌టీఐ)లో రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు కూరగాయల సాగు, సస్యరక్షణపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని చెప్పారు. మార్కెట్ ధరలను అంచనా వేసుకుని పంటలు సాగు చేసుకోవాలని కోరారు. నీటి వసతి ఉన్న రైతులు వేసవిలో టమోటా పంట సాగు చేసుకుంటే మంచి ధర వస్తుందని చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ మాట్లాడుతూ ప్రతి ఉద్యానవన రైతు డ్రిప్ పద్ధతిలో నీరు, నీటిలో కరిగే రసాయనిక ఎరువులు వాడాలని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆవశ్యకత, ప్రయోజనాల గురించి వివరించారు. ఉద్యానవన శాఖ అందించే రాయితీలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి ఎం.శ్రీలక్ష్మి మాట్లాడుతూ రైతులు నీటి కుంటలు ఏర్పాటు చేసుకుని నీటి వనరుల సంరక్షణ విధానాలు పాటించాలన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా అందిస్తున్న పలు పథకాల గురించి వివరించారు. పొదిలి, గిద్దలూరు, దర్శి ఉద్యానవన శాఖాధికారులు డి.సంధ్య, విష్ణుప్రియ, రవి వెంకన్న, కురిచేడు, చీమకుర్తి, గిద్దలూరు, కంభం, రాచర్ల, దర్శి ప్రాంత రైతులు పాల్గొన్నారు.

బాలినేనికి యాదవ కార్పొరేటర్ల ధన్యవాదాలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి శనివారం జరిగిన నగర పాలక సంస్థ పాలకమండలి సమావేశంలో యాదవ కార్పొరేటర్ల ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిల్‌లోని యాదవ కార్పొరేటర్లు బాలినేనిని రెండు కోర్కెలు కోరారని, ఆ రెండు కోర్కెలను మన్నించి అధికారులకు చెప్పడంతో పాటు కౌన్సిల్ కూడా ఆమోదం పొందేవిధంగా బాలినేని చర్యలు తీసుకున్నారని కార్పొరేటర్ యనమల నాగరాజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అఖిల భారత యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ శ్రీ కృష్ణ కళ్యాణ మండపం, యాదవ భవనాల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని బాలినేనికి విజ్ఞప్తి చేశారు. అందుకోసం 19వ డివిజన్‌లోని పెళ్లూరు సర్వే నంబర్ 78–1లో నగర పాలక సంస్థ పరిధిలోనే 70 సెంట్ల భూమిని కేటాయించడంతో బాలినేనికి రుణపడి ఉంటామన్నారు. అదేవిధంగా యాదవ ప్రొటెక్షన్ ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లెబోయిన రాజుయాదవ్ అభ్యర్థన మేరకు ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ అన్నవరప్పాడు విద్యుత్ భవనం ముందు యాదవుల ఆరాధ్య దైవం అయిన కాటమరాజు యాదవ్ విగ్రహం ఏర్పాటుకు కూడా బాలినేని అంగీకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పాస్టర్స్ యూనియన్ సంతనూతలపాడు నియోజకవర్గ కమిటీ ఎన్నిక



కుందా లింగేష్

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సంతనూతలపాడు నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సంతనూతలపాడులో జరిగిన కమిటీ సమావేశంలో అధ్యక్షునిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కుందా లింగేష్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కలతోటి బాబూరావు తెలిపారు. లింగేష్ మాట్లాడుతూ దైవ సేవకుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సీసీ కెమేరా నిఘాలో పరీక్షలు

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు: సీసీ కెమేరా నిఘాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ఎవరైనా పరీక్షల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం స్థానిక ఆంధ్రకేసరి జూనియర్ కాలేజీలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, స్క్వాడ్ బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో సీసీ కెమేరాల అమరిక, మానిటరింగ్, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్చి 1 నుంచి ఉదయం 9 గంటలకు ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం 8.30 నుంచే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించనున్నట్లు చెప్పారు. 9 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఉండదన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం నూతన ప్రకాశం జిల్లాలో 69 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డీఐఈవో, పరీక్షల జిల్లా పరిశీలకులు ఐ.శ్రీనివాసరావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.ఆంజనేయులు, కె.స్వరూపారాణి, జి.మనోహర్‌రెడ్డి, ప్రశ్నపత్రాల జిల్లా బల్క్ ఇన్‌చార్జి సీహెచ్ తారావాణి, తదితరులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని కొండమీద శ్రీగిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని గిరి ప్రదక్షిణ చేశారు. శ్రీగిరి పాదపీఠం వద్ద బాపూజీ గో సంఘం వద్ద నుంచి సుందరంగా అలంకరించిన రథంపై గంగా పార్వతీ సమేత శివయ్య ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి భక్తులు స్వామివారి నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. స్థానిక కోర్టు సెంటర్, గ్రంథాలయం, పొట్టి శ్రీరాములు విగ్రహం, కేశవస్వామిపేట దేవాలయాలు, భగీరథ మహర్షి విగ్రహం, వేప అంకమ్మ తల్లి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఆంజనేయ దేవస్థానం, లక్ష్మీ గణపతి దేవస్థానాలను చుట్టి గోశాల ముందుగా శ్రీగిరి చేరారు. అనంతరం స్కందగిరి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం వద్ద గిరి ప్రదక్షిణ ముగించారు. గరుత్మంతుడు, హనుమంతుడు, శంకు చక్ర నామాలను చేతపట్టి దీప జ్యోతిని తలపై పెట్టుకుని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దాడులు ముమ్మరం చేయండి



సెబ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు

- సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి
- మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకోండి
- ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా చర్యలు
- సెబ్ అధికారులతో సమీక్షలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు సబర్బన్: రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సెబ్ అధికారులు దాడులు ముమ్మరం చేయాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక తన కార్యాలయంలో శనివారం సెబ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే అప్రమత్తం కావాలని ఆదేశించారు. సమాచార వ్యవస్థను ఇప్పటి నుంచే మెరుగుపరుచుకోవాలన్నారు. గ్రామ స్థాయి నుంచి ఎప్పటి కప్పుడు సమాచారం వచ్చే విధంగా వ్యవస్థను తయారు చేసుకోవాలని చెప్పారు. ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని, క్షేత్ర స్థాయిలో ముందస్తుగా అన్నీ సిద్ధం చేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల ఆనవాళ్లు లేకుండా సమూలంగా అరికట్టాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం జిల్లాలోకి రాకుండా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరిహద్దు స్టేషన్లను అప్రమత్తం చేసుకోవాలని కూడా సూచించారు. పెండింగ్ కేసులను ఛేదించాలని కూడా ఆదేశించారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో నాటుసారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాల (ఎన్‌డీపీఎస్) సరఫరా, విక్రయం లాంటివి జరగకుండా చర్యలు కఠినంగా చేపట్టాలన్నారు. ఇసుక సంబంధిత కేసులు, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని గుర్తించి మరీ ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే నాగేశ్వరరావు, సెబ్ ఈఎస్ రవికుమార్, మార్కాపురం ఏఈఎస్ దుర్గా ప్రసాదు, సీఐ వంశీధర్, సెబ్ అధికారులు పాల్గొన్నారు.